నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 20 మార్చి 2024 | ADILABAD

# నిఘా కోసమే శిక్షణ

- ఎస్పీ జానకి షర్మిల


మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 19 : మే 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ప్రత్యేక నిఘాను పటిష్టం చేసేందుకు పోలీసు, గ్రేహౌండ్స్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు సిబ్బందికి శారీరక దారుఢ్యం, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా, శాంతిభద్రల రక్షణలో నిర్వర్తించాల్సిన బాధ్యతలు, మెలకువలను నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు రాం నిరంజన్, శైలేందర్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు వినోద్, సాయికృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.


తలమడుగు మండలంలోని పల్లి(కే)లో జొన్న పంటను పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


నిర్మల్ ఆసుపత్రిలో ఓపీ వద్ద బారులుదీరిన రోగులు

# దవాఖాన కిటకిట

● ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి ● నిత్యం 700-800 వరకు రాక

*శీతాకాలం ముగిసి వేసవికాలం* ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా వ్యాధులు ప్రబలి దవాఖానలకు రోగుల తాకిడి పెరుగుతున్నది. పగలు ఎండ.. ఉదయం, సాయంత్రం వేళల్లో చల్లగా ఉంటుంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం వంటివి వస్తున్నాయి. ప్రభుత్వ దవాఖానలకు గొంతు, శ్వాసకోస వ్యాధులకు సంబంధించిన రోగులు అధికంగా వస్తున్నారు. నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు రోజు 700 నుంచి 800 మంది వరకు ఔట్ పేషెంట్స్(ఓపీ) వస్తున్నారు. సీవోపీడీ, అస్తమా, దగ్గు, జలుబు, జ్వరానికి సకాలంలో చికిత్స చేయించుకోకపోతే వ్యాధులు ముదిరి ఆస్కారం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

*- నిర్మల్ చైన్‌గేట్, మార్చి 19*


అడెల్లి పోచమ్మ దర్శనానికి ఎడ్ల బండ్లపై వెళ్తున్న గిరిజనులు

# బండెనక బండి కట్టి..

*అందూర్ గ్రామానికి చెందిన* ఆదివాసీ గిరిజనులు మంగళవారం అడెల్లి పోచమ్మ దర్శనానికి బయలుదేరారు. గ్రామంలోని 82 కుటుంబాల వారు ఎడ్లబండ్లపై కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి పయనమయ్యారు. యేటా గ్రామస్తులంతా కలిసి ఒకే రోజున వెళ్లి మొక్కలు తీర్చుకుంటారు.

*- బోథ్, మార్చి 19*


ఇంద్రవెల్లి : ఆరబెట్టిన మక్కలలోకి చేరిన వర్షపు నీరు


ఇంద్రవెల్లి : వర్షానికి తడిసిన మక్కలను చూపుతున్న రైతు నానక్‌సింగ్

# అకాల నష్టం

**ఆదిలాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన**

● 900 ఎకరాల్లో పంట నష్టం ● దెబ్బతిన్న జొన్న, నువ్వు, మక్క, పొగాకు, కంది పంటలు
● పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్, అధికారులు ● ఈదురుగాలులతో లేచిపోయిన ఇంటి పైకప్పులు
● పంట నష్టపరిహారం చెల్లించాలని రైతుల వేడుకోలు

ఆదిలాబాద్, మార్చి 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో జొన్న, మక్క, నువ్వు, పొగాకు, కంది పంటలు దెబ్బతిన్నాయి. తలమడుగు, బజార్‌హత్నూర్, జైనథ్, బోథ్, గుడిహత్నూర్ మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంటలు చేతికొచ్చే దశలో ఉండగా కురిసిన వర్షాలు రైతులకు నష్టాన్ని చేకూర్చాయి. వందలాది ఎకరాల్లో జొన్న పంట నేల కొరిగింది. నష్టం వివరాలను సేకరించడానికి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, 900 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, తలమడుగు జడ్పీటీసీ గణేశ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య వివిధ ప్రాంతాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లి మండలం కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో రైతులు ఆరబెట్టిన మక్కలు తడిసి ముద్దయ్యాయి. తడిసిన మక్కలను రైతులు ఎత్తుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. వర్షం, ఈదురుగాలుల కారణంగా పంటలను నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. తలమడుగు మండలంలోని మధనపూర్, బరంపూర్, నంది గామతోపాటు ఆయా గ్రామాల్లో కూడా వడగళ్ల వాన పడింది. బజార్‌హత్నూర్, జాతర్ల గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది.


తాంసి : పల్లి(కే)లో నేలకొరిగిన మొక్కజొన్న పంట


తాంసి : నందిగామలో కురిసిన వడగండ్లు


గుమ్మెనలో మూసి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల


ఎంగ్లాపూర్‌లో..

# బడులకు తాళం

**వారానికి రెండు రోజులే వస్తున్న ఉపాధ్యాయులు**

పెంబి, మార్చి 19 : మండలంలోని గుమ్మెన కోలాంగూడ, ఎంగ్లాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఐదో తరగతి వరకు బోధిస్తున్నారు. గుమ్మెన కోలాంగూడ బడిలో 10 మంది, ఎంగ్లాపూర్ పాఠశాలలో 12 విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శ్రీకాంత్, శంకర్‌లు వారానికి రెండు రోజులు పాఠశాలకు వస్తున్నారు. కాగా.. మంగళవారం ఈ రెండు పాఠశాలలను 'నమస్తే' సందర్శించగా.. బడులకు తాళం వేసి ఉంది. అలాగే దోందారి నాయకపుగూడ ప్రాథమిక పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దివ్యశ్రీ దూరభారం అవుతుందని, డిప్యూటేషన్‌పై దస్తురాబాద్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈమె స్థానంలో ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుకున్న ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలికి వేతనం ఇచ్చి బోధింప చేస్తున్నారు. ఈ విషయాలపై ఎంఈవో మధుసూదన్‌ను వివరణ కోరగా.. శ్రీకాంత్, శంకర్‌లు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వీరు సక్రమంగా విధులకు వెళ్ళడంలేదని తమ దృష్టికి వచ్చింది. డీఈవోకి రిపోర్టు చేసి వారి డిప్యూటేషన్‌ను రద్దుచేస్తాం. వారి పోస్టింగ్ స్థానాలకు పంపించి ఈ పాఠశాలలో నూతన ఉపాధ్యాయులను నియమిస్తాం. దోందారి నాయకపుగూడ పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడంతో దివ్యశ్రీని డిప్యూటేషన్‌పై దస్తురాబాద్ మండలానికి పంపాం. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నాయకపుగూడ ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయురాలు

## 'పది' పరీక్షా కేంద్రం

# పైకప్పు కూలి..

**పరీక్ష రాస్తున్న విద్యార్థినీకి, విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్‌కు గాయాలు**


గాయపడ్డ అక్షయ

జైనథ్, మార్చి 19 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి హిందీ పరీక్ష జరుగుతున్నది. దాదాపు మధ్యాహ్నం 12.20 గంటలకు పైకప్పు కూలి(గూన పెంకల ఇల్లు) పరీక్ష రాస్తున్న విద్యార్థిని అక్షయ తలపై, విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ పురుషోత్తంపై పడ్డాయి. అక్షయ తలకు గాయం కాగా.. పురుషోత్తంకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఇద్దరిని గిమ్మ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై కేంద్రం సీఎస్, ఏఈవోలను వివరాలు కోరగా సమాచారం లేదన్నారు.

# మీడియా సెంటర్ ప్రారంభం

ఎదులాపురం, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్(ఎంసీఎంసీ)ను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఈ మేరకు ఎంసీఎంసీలో ఏర్పాటు చేసిన టీవీలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు డీపీఆర్వో ద్వారా అందిస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలను అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేస్తామని పేర్కొన్నారు. శాటిలైట్ ఛానల్, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, ఈ-పేపర్‌లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ మెస్సేజ్‌లు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలు, రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, డీపీఆర్వో తిరుమల, ఈడీఎం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

# అన్ని అంశాలపై అవగాహన ఉండాలి..

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా**

ఎదులాపురం, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలు, ఈవీఎం, పోలింగ్ స్టేషన్లపై అవగాహన కలిగి ఉండాలని సెక్టోరల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. అనంతరం అన్ని అంశాలపై ట్రెయినర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

# మక్కకు మద్దతేదీ?

● మార్క్‌ఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయని కాంగ్రెస్ సర్కారు
● మొక్కజొన్న పంట ఉత్పత్తులు చేతికొస్తున్నా స్పందించని ప్రభుత్వం
● ప్రైవేట్ వ్యాపారుల కొనుగోలుతో క్వింటాలుకు రూ.200 నష్టపోతున్న రైతులు

నిర్మల్ టౌన్, మార్చి 19 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. కుంటాల, దిలావర్‌పూర్, లోకేశ్వరం, సారంగాపూర్, భైంసా, కుభీర్, నిర్మల్ మండలాల్లో పంట ఉత్పత్తులు చేతికొస్తున్నాయి. ఈ సమయంలో మార్క్‌ఫెడ్ అధికారులు 40 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ.. ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,070 మద్దతు ధర ప్రకటించినప్పటికీ.. కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు కల్లాల వద్దకే వచ్చి మక్కను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దాదాపు రూ.200 తక్కువగా ఇచ్చి రూ.1,950కే కొంటున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ధర పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని కర్షకులు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా.. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.


అమ్మడానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న

## మద్దతు ధర కంటే రూ.200 తగ్గింది..



నా పేరు వినాయక్. నాది మెదన్‌పూర్. నేను వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తా. నాకు ఐదెకరాల భూమి ఉండగా.. మొక్కజొన్న వేసిన. విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం వేలల్లో డబ్బులు అయ్యాయి. గతేడాది ధర మంచిగా ఉండడం, చెల్లింపులు కూడా సక్రమంగా జరగడంతో రందీ ఉండదని మక్క వేసిన. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రైవేట్ వ్యాపారులేమో మద్దతు ధర కంటే రూ.200 తక్కువగా కొంటున్నా రు. ఇలా అయితే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట వేసి నష్టపోయే పరిస్థితి దాపురించింది.